శోభ

'బిందుశ్రీ'

ప్రొద్దుట ఆరుగంటలవుతోంది.

ఇట్టి తరుణంలో తన కాంతి దివ్యప్రభావంతో చక్కని సుషుప్తినుండి మేలుకోమని ఆదేశిస్తూ మానవ హృదయాలలో వెలుగు నీడల పరచుతున్నాడు ఉదయభానుడు.

తూర్పు కనుమపై మొలిచిన పసుపువన్నె లేతకిరణాలు చంద్రబింబమువంటి శోభ ముఖంమీదపడి, జగన్మోహనమైన ఆమె చిరునగవుతో దోబూచులాడుతున్నాయి.

శోభ లేస్తూనే కాంతుడ్ని మేల్కొల్పి, చెరిగిన ముంగురులను సరిజేసుకొని "సుమిత్రా" అని పిలిచింది.

కిటికీ తెర తొలగించి అనంతప్రకృతి సౌందర్యాన్ని చూడటంలో నిమగ్నురాలయివున్న సుమిత్ర ఒదిన పిలుపుకు "వూ" అని సమాధానముచెప్పి అన్న ఒడిలోవచ్చి కూర్చుంది.

ఆనందరావు చెల్లితో 'సుమిత్రా - గృహలక్ష్మి ఆజ్ఞ యేమిటో కనుక్కో తల్లీ - మనిద్దరం జవదాటరాదు మరి' - అంటూ వెలుపలికి త్రోసుకొస్తూన్న చిరునగవును నెమ్మదిగా ఆపుకుంటూ చెల్లెలి కురుల్ని దువ్వాడు.

శోభ వారిద్దరివంక కోపంగా చూసింది, తన కండ్ల మిలమిలలతో వల్లభుడ్ని తనలో బంధించుకుంటూ.

గాలికి కిటికీతెర వూగిసలాడుతోంది. ఆ తెరపై ప్రతిఫలిస్తూన్న వెలుగురేఖలు శోభ ముఖవర్చస్సుకు క్రొత్త అందాన్ని చేకూరుస్తున్నాయి.

వారిద్దరిని క్రీగంట చూస్తూన్న శోభ తన పెదవుల చాటున స్నిగ్ధసౌందర్యాన్ని దాచుకుంటూ రాయంచ నడకతో ఇంట్లోకి దారితీసింది.

"తోడు దొంగలు" అని శోభనుండి విడివడిన మాటకు వారిద్దరూ తెల్లబోయి వొకరిముఖాలొకరు చూసుకొని బిగ్గరగా నవ్వుకుంటూ కాలవాహినిలోని నిత్యకృత్యాల వేడుకను చూడటానికై శోభ వెనుకే వెళ్ళారు.

ఉదయభానుడు పోను పోను ఒక్కొక్క మెట్టే పైకి వెళ్ళుతున్నాడు.

ఎవరికివారే యమునాతీరే అన్న వేదాంతసూక్తిని తన మనస్సులో పదేపదే తలచుకుంటూ తరలిపోతున్నాడు విరాగి ప్రపంచయాత్రకు.

2

ఎదురుగా వాకిటి తలుపు తెరిచివుంది. అంధకార నృత్యాన్ని బహు ముఖాల విస్తరింపజేస్తోంది నిశాంగన. పగలంతా దేదీప్యమానంగ వెలిగిన పగటి వేళను సునాయాసంగ కబళించి వేసింది నిశాదేవి.

పార్కులోని రేడియో యేదో తీయని గానమాధురుల నందిస్తోంది శ్రోతల కర్ణపుటాల్లో.

గింగిరాలు తిరిగియున్న జుత్తును చేతితో ఒక ప్రక్కకుత్రోసి మరల తల ఒంచేసుకుని కుర్చీకి చేరగిలబడి విసుగుతో చేతిలోని పేపరును అవతలగా నెట్టాడు ఆనందరావు.

మానవుని చేతియందు పరాభవించబడిన పేపరు సిగ్గుతో అభిమానంతో కృంగిపోయి గాలికి రెపరెపలాడుతూ, ఆనందరావు ముఖంవైపే చూస్తోంది.

"సుగుణ రాశియైన గృహిణికి తన భర్తే సర్వస్వం. సంసారంలో ఆలుమగలు పెనుతుఫానుల ప్రసరింపనీయక ఆనంద కిరణాల చవిచూడాలంటే అటువంటి జీవిత లక్ష్యాన్ని సాధించేందుకు బాధ్యులెవరు ?"

ఓ కథకుడు వ్రాసిన యీ సమస్య ఆతని స్మృతి

పథంలో మెరసి మరల మాయమవుతోంది. ఈ విషయంలో శోభ దురదృష్టవంతురాలని తలపోశాడు ఆనందరావు.

అతని మస్తిష్కంలో మంచి చెడుల పరస్పర విరుద్ధ భావాలు యిటు అటూ పరువులెత్తుతున్నాయి. ఈ ఆలోచనల సందడిలో ఆనందరావు ముఖంమీద నలుపు నీడలు క్రీనీడలా ఆవరించాయి. అతడు గతంలో తలపోసిన భావనలన్నీ మనో వీధిలో నర్తకిలా సాగిపోతూ వొకింతసేపు మందంగవున్న అతని మనస్సు నల్లకల్లోలపరుస్తున్నవి.

ఎదురుగా చాపమీద శోభ, సుమిత్ర ఒండొరులు వొకరి నానుకుని ఒకరు పండుకొనియున్నారు. ఒకప్పుడు శోభయొక్క సముజ్వల ముఖంలో నూతన శోభలను అవలోకించాడు ఆనందరావు. ఆమెను భార్యగా పొందిన పిమ్మట ప్రకృతి ప్రసాదించిన వనితా రత్నమని ఉప్పొంగిపోయాడాతడు.

పది నిమిషాలకాలము నిశ్శబ్దంగా గడచింది.

అతని మనస్సులో ఆందోళనయొక్క తేజస్వరూపము తొంగిచూస్తోంది. అతని కిప్పుడు తనలో మసలుతూన్న విషయం బాగా అర్ధమయ్యింది.

"అగ్నిహోత్రుని సమక్షాన, వసిష్ఠులవారి ఆశీర్వచనలతో పదిమంది యెదుట భార్యగాబడసిన అర్ధాంగిని సంతోషపెట్టడం పురుషుని కర్తవ్యం."

భార్య భర్తను ఆరాధిస్తుంది, పూజిస్తుంది. తనలోని స్త్రీత్వానికి పరిపూర్ణతనే మెరుగులు దిద్దటానికి సర్వవిధాలా భర్తకు ఆసరాగా నిలచి ఆనందమందిరాన్ని నెలకొల్పుతుంది. ఆమెకు భర్తే ధ్యేయం.

ప్రేమికులు సమాజంలో దంపతులుగా మారాలని తీయనికలలు కంటారు. వారు కల్పించుకున్న ఆ ప్రేమలు కలకాలము వారి హృదయాలలో నిర్మలంగా వుంటే అదృష్టవంతులే. ప్రేమికులకు గమ్యస్థానము పెండ్లి. ఈ పెండిలియే వారి భావి జీవిత పురోగమనానికి మధురవసంతాల కురిపిస్తుంది.

వారెన్నో రాత్రులు ఒంటిగా, ఆకులో ఆకుగా, పొదరింటిలోని కోయిలగా చరిస్తారు.

ఇటువంటి నిర్దుష్టస్థానాన్ని ఆక్రమించుకున్న ఆలుమగలు తమ ఆనందాన్ని తమకు కలుగబోయే పుత్రుని సమక్షంలో సద్వినియోగపరుచుకుంటారు.

తృప్తిలేని మానవుని దూరంగా విసిరేయమన్నారెవరో ఒకప్పుడు. సంతృప్తి అనేది వారల హృదయాలలో పొందికగా నిలచియుండాలి. కొంతమంది మానవులు అర్ధంలేని ఆశయాలతో, సాధించలేని జీవితంలో ఒనగూడని ఆదర్శాలను వారి మనస్సులలో వూహించుకుని, నైతికంగా పతనానికి దారి తీస్తున్నారు. అందుకనే ఈ ప్రజలు సంతృప్తి అనే వున్నతపధాన్ని ఆక్రమించుకోలేకపోతున్నారు.

గడియారం 11 గంటలు కొట్టింది.

తెరచియున్న కిటికీగుండా చెవులతో పొంచి చూస్తూ తన చిన్నికండ్లతో యెదుటివాని హృదయాన్నికూడ కరగించే నేర్పరితనాన్ని ప్రదర్శించాలనే సహజ లలిత మనస్తత్వంకల పెంపుడు కుక్కను చూస్తున్నాడు ఆనందరావు, ఈతని యింటిని, ఇంటిలోని తన భార్యను, చెల్లిని యెట్టి ఒడుదుడుకులకులోను కాకుండా సర్వకాల సర్వావస్థలందు కాపాడుచుండే ప్రియమైన స్నేహితుడు ఈ భాను, (కుక్క పేరు).

ఆనందరావు హృదయంలో ఆవేదనలూరకే కట్టలు త్రెంచుకుని ప్రవహిస్తున్నాయి. అతని హృదయంలోని నైర్మల్యాన్ని కోల్పోవుతున్నాడా అన్నట్లుందిఅతని పరిస్థితి. అతడు నీరసంగా ఆక్రోశించాడు. అతని మనస్సు యేమీకుదుటబడలేదు.

శోభ ఒంట్లో అస్వస్థతగా వుంటోంది గతవారం రోజులనుండి. ఆమె అటులే లేస్తూ, మగనికి వుపచారంచేస్తూ, భారతనారి ఆదర్శాలను ఆశయాలను నెరవేరుస్తూ, ఆడబిడ్డ సుమిత్రకు, నీతి, సాంప్రదాయం, గౌరవ ప్రపత్తులను వల్లెవేస్తూందిప్పటినుండే. దీపపుకాంతి వెల్లువ ఆ యింటికి క్రొత్త శోభను వొనగూర్చుతోంది.

వసారాలో ఆవు అంబా యంటూ అరుస్తోంది.

"వదినా" అన్న పిలుపుకు కండ్లువిప్పి చూసింది శోభ. ఆమె హృదయం శృతిగా దడదడ కొట్టు కుంది కొంతసేపు.

"ఏమమ్మా - సుమిత్రా"

"మంచి నీరు" అన్న సమాధానం విని శోభలేచి పందిరి మంచంక్రింద వుంచిన మరచెంబులోని నీటిని యిచ్చి ఆమెను నిద్రబుచ్చింది. నిద్ర ఆమెను త్రోసుకువస్తోంది. అవులింత లూరకే వస్తున్నాయి.

గొడ్లసావడిలో ఆవు కట్టుకొయ్యతో దెబ్బలాడు తోంది. ఆ నోరులేని జీవికి పచ్చగడ్డివేయటం మరిచి వుంటారు ఆనందరావు అనుకుంది శోభ.

నీటితో కండ్లను తుడుచుకుని పందిరి మంచంమీద ఆనందరావును చూచిందామె. పందిరి మంచంమీద చక్కని సుషుప్తిలో లీనమయ్యే ఆనందరావు ఈ రోజు యెక్కడి కెళ్ళినట్లు - ఆమె మనస్సునుండి ఈ ప్రశ్న విడివడింది. ఎంత సేపటికి సమాధానము రాలేదు.

బదులుగా వాలుకుర్చీలో కాళ్ళు ముడుచుకుని నిద్రాదేవి ఒడిలో పరుండియున్న తన విభునిచూసి తెల్లబోయిందా యిల్లాలు. పక్కను దులిపివేసి, ఆతడ్ని లేపి, పండుకోబెట్టి, వాకిటిలో మేతకోసం వేచియున్న గోమాతను దర్శించాలని బయలుదేరింది.

తలుపు చప్పుడుకు ఆనందరావు తృళ్ళిపడిలేచాడు.

లేస్తూనే "శోభా" అని కండ్లతోటే ప్రశ్నించాడు. ఆమె తను చేయబోయే కర్తవ్యాన్ని మూగ నోముతోనే బోధపర్చింది.

'అయితే నేనూ వస్తున్నా' అంటూ బ్యాటరీలైటు తీసుకుని ఆమె ననుగమించాడు. ఆవు విలాపం కట్టలు త్రెంచుకుంది. యజమానునిచూసి కన్నీరు కార్చింది. ఆలుమగల హృదయాలు జాలిగా క్షమించమని ప్రాధేయపడినాయి.

ఆనందరావు హృదయం ద్రవించింది. శోభ తెచ్చిన తౌడు రుచ్యంగా ఆరగించింది ఆవు. ఆనంద రావు మేతవేసి, ఆవు వీపును ఒకసారి దువ్వి, జనుప కట్టను తినుమని లాలనగా అడిగాడు. గోమాత కృత జ్ఞతా సూచనగా వారి కభివాదంచేసింది.

చిన్నారి సుమిత్ర తన బుజ్జాయికి నిత్యం నీళ్ళు పడుతుంది. ఇది ఆమె డ్యూటీలో రోజులో నొక భాగము. గోవు తొలి సంతానానికి బుజ్జాయి అని నామకరణం చేసింది సుమిత్ర. తొట్టిలోవున్న కమ్మని కుడితి తన చిన్నారి బుజ్జాయి త్రాగుతుంటే, ఆమె హృదయ పంజరంలో కరిగినకలలు తీయని తలపుల ద్వారా వెలుపలికివస్తూ, చిన్నారిపసికూనకు, బుజ్జాయికిగల స్నేహపు ఫణితులను ఒకే శృతిలో కలిపి వేస్తుంటాయి.

నిరుడు సంవత్సరాదికి సుమిత్ర బుజ్జాయి ఆ లోకం నుండి ఈ లోకానికి వూడిపడింది. ఆ లేగదూడకు ఆకలివేస్తే, సుమిత్రకు ఆకలివేస్తుందా అనిపిస్తుంది. దాని ఒంట్లో యేమాత్రము కులాసాగా లేకపోతే సుమిత్రకూడ యేదో అయోమయంగానే ఆ కాసేపు గడపుతుంది.

ఏమిటో దైవనిర్ణయం! సుమిత్రకు ఈ లేగ దూడకు మధ్య నిర్ణయించిన బాంధవ్యాల అంతస్థు లేమిటో! ఆ సృష్టికర్తకే తెలియాలి.

లేగదూడ నోరులేనిది. సుమిత్రకు వాక్కువుంది. జవసత్వాలున్నాయి. కాని బుజ్జాయితోడిదే ఆమె జీవితం.

సుమిత్రకు బుజ్జాయికి మధ్య పాదుకొనిన యిటు వంటి సంబంధ బాంధవ్యాలను, వాత్సల్యము, ప్రేమ లను తలచుకొని నవ్వుకుంటూ వుంటారప్పుడప్పుడు యీ ఆలుమగలు.

"తన సహాధ్యాయి యిప్పుడులేదని మూగనోము పట్టిందండోయ్" అని నవ్వుతూ అంది శోభ భర్త నుద్దేశించి.

"నిజమేనా బుజ్జీ" అని లాలనగా అడిగాడు ఆనందరావు.

ఆ లేగదూడ చిన్ని నేత్రద్వయం యజమానిని హర్ష పులకితుడ్ని చేసింది.

ఆతనొకసారి ఆకాశంవంక పరీక్షగా చూశాడు. వినీలాకాశం వింత మార్పులతో మేదినిపై స్వైర విహారం చేయబోతున్నట్లు స్పష్టమాతోంది. వీధి దీపాలు వింత కాంతితో వెలవెల బోతున్నాయి. రోడ్డంతా నిర్మానుష్యంగావుంది. కార్ల కాంతి వెల్లువగావును అప్పుడప్పుడు చీకటిని చీల్చి వేస్తోంది.

ఇంట్లోకి రండని చెప్పింది శోభ భర్త నుద్దేశించి.

ఆనందరావు పడకగదిలోనికి దారితీశాడు. ఆతని వెనుకే నడచింది శోభ.

బాగా ప్రొద్దుపోయింది. తెల్లవారటానికాట్టే వ్యవధిలేదు.

"అయితే ఏమిటి నీ అభిప్రాయం" ఆనందరావు ప్రశ్న -

"రేపు సోమవారం - ఆఫీసు ప్రొద్దుట 8 గంటలకు. ఇప్పుడు 2-15 నిమిషాలయ్యింది. 6 గంటలకు నాధుడు మేల్కొంటేకాని వారు 8 గంటలకు వెళ్ళటం పడదు" శోభ సమాధానం.

'మాటకారి' అనుకున్నాడు ఆనందరావు.

'ప్రళయంరానీగాక_'

అంబుధులింకుగాక - ఈ ఆడవారు వారి ఆలోచనలను, మనస్తత్వాలను, లోపల అగ్నిగోళపు తెరలుండుగాక_

పైకి మాత్రము యేమాత్రము వారి భావాల్లో వ్యక్తీకరించరు.

కెన్నలా హృదయాన్ని విప్పిచెప్పతారు స్త్రీలు.

శోభ మూర్తీభవించిన సౌందర్య దేవత - సుగుణగని అని సమాధానం చెప్పుకున్నాడు ఆనందరావు.

ఆతను ఒత్తిగిలిపడుకున్నాడు. ఆతని వుంగరాల జుత్తును చేతితో తాకుతూ, ఆతని పెదవులస్పృశించబోయిందామె. ఆ విశిష్టపు సౌందర్యగనియొక్క కన్నుగవ కాంతుల్నీ, ఆనందాన్ని చూస్తూ తృప్తితో మేనువాల్చాడు అతడు. శోభ అతని మూర్తిలోని సంతోషపు రేఖలను నగ్నంగాచూసి, తృప్తిగా కన్ను మూసింది.

8

ఆనందరావు అందరిలాటి మానవుడే. ఆతనికి విజ్ఞానము, గౌరవము యేవో అతీతశక్తుల్ని పొందాలనే వుత్సుకత మెండుగ వున్నాయి. ఇవి ప్రతిజీవి వారి జీవితాలలో లీలగ నిర్మించుకునే గాలిపడగలే. ఒక్కొక్కరు తమ మనోరథాలను, ఆశయాలను శాశ్వతంగా గాలిలో మహోన్నతపు శృంగాల్లా నిర్మించుకుంటారు. కాని వారు సృజించుకొనిన యీ గాలిమేడలు అనవరతము ఆకాశచిత్రాలలాగానే వుండిపోతాయి.

దీపాన్ని గాలికి ఒదిలిపెడితే యేమవుతుంది? హోరుగాలికి యెదురుపోరాడలేదు ఆ దీపము. ఆ దీపము కొండెక్కి వూరుకుంటుంది. అదేమాదిరి ఈ అభాగ్యుల గగనసౌధాలు గోడలు విచ్చిపోయి భూమిలో రేణువుల రూపంలో నల్దిక్కులా వ్యాపిస్తాయి.

శోభ ఆమె మాతృమూర్తి కాబోతున్నానని సంతోషపారవశ్యత చెందింది. ఆమెకు నాలుగు నెలలు గడచినవి - ఆమెకిదే తొలికాన్పు. ఆమె తనలో పెరుగుతూన్న పిండాన్ని చూసుకొని వూరకే మురిసిపోతోంది. ఆమె అతి సంతోషాన్నిచూసి ఆతడు లోలోన హర్షించాడు.

ఆమె కలలు నిజాలవ్వాలని భగవంతుని ప్రార్థించాడు ఆనందరావు, ఆమెను తన హృదయానికి హత్తుకుంటూ.

ఒకనాడు అమాయికంగా నిద్రపోతూన్న ఆమె వదనంలోని చిరునగవు రేఖలను చూసి ఆనందించాడు

ఆతడు. తనదేవి మాతృమూర్తి కాబోతున్నదని సంతోషతరంగములలో విహరించాడు ఆనాటి ఆనందరావు. కాని భగవంతుడు ఈ సంతోషపు దినాలను దూరంచేసి, ఆమె వేదనల నధికంచేశాడు.

ఆమె ఎర్రటి పెదిమలే ఆ శిశువుకుకూడ. ఆమెకు పుట్టిపోయిన పిల్లవాడు అచ్చంగా తల్లిపోలికే. ఆమె మేనిఛాయే కుమారునికి వచ్చింది. ఆ పసివాని ముక్కుతీరు అదీ అంతా తల్లే - తల్లే ముమ్మూర్తులా. సందేహంలేదు.

విరించి యీ విశాల విశ్వాన్ని వింత వింత పోకడలతో, వివిధ భంగిమలలో సృష్టించాడు. ఈ మానవ హృదయాలలో, అనేకమైన మధురానుభూతులను పొందాలనే కోరికలను నిలిపి తను ప్రక్కకు తప్పుకున్నాడు. ఇచ్చట మానవుడు పొందుతూన్న అవ్యక్తమైన ఆవేదనలను, ఆనందాలనుచూచి, తన పనిని నిర్విఘ్నంగా జరుపుకొంటూ వుంటాడు ఈ సృష్టికర్త. ఇదీ లోకంపోకడ.

4

మాతృహృదయం తన పసిపాపను అవ్యాజమైన ప్రేమతో తన వక్షస్థలిని హత్తుకొని ఆనందించాలని వుబలాటపడుతుంది. ఎల్లవేళలా ఆ బిడ్డ సంతోషమే తన ఆనందమని వువ్విళ్ళూరుతుంది ఆ మాతృమూర్తి. ఆతని కేరింతలే ఆమె వెలుగు నీడలని తలపోస్తుంది.

మాతృ హృదయం బిడ్డడు కలిగిన తర్వాత కొన్ని ఐహిక సుఖాలపై వుదాసీనత నవలంబిస్తుంది. ఆ బిడ్డనే తన హృదయానికి అదుముకొని సతతం ఆనందిస్తుంది.

ఈ కాలపు మానవుడు ఆమెను నిందిస్తాడు. ఆమె ఓరిమిని మరోలా అర్థంచేసుకుంటాడు. పసిపాపకు పాన్పు విడిగా అమర్చాలి. వానిని నీ వద్దే యెప్పుడూ పెట్టుకుని కూరుచుంటే నీ ఆరోగ్యము చెడిపోతుంది. అసలు నీ ఆరోగ్యము యేమీ బాగులేదు. ఇటువంటి సమయంలో తల్లిపాలు త్రాగితే బిడ్డడు ఆరోగ్యం చెడుతుంది. ఈ కల్లబొల్లి మాటల అంతరార్థం యేమిటి? ఆమె ద్వారా తనకు కావలసిన సుఖాన్ని పొందుదామనే కాంక్షతోటి ఆమెకీవిధంగా నీతి బోధలు చేస్తాడు.

ఇటువంటి తరగతి మానవునియొక్క క్షణిక ఆలోచనల తలచుకొని ఆనందరావు బాధతో ఆక్రోశించాడు. ఎల్లవేళలా భర్తయే తన పాలిదేవత అని కొలిచే స్త్రీ యెడలా ఈ పురుషుని యిటువంటి చేష్టలు.

అది క్షమించరాని విషయం!

భార్య అస్వస్థత నెరిగియున్న యీ పురుషుడు ఆమెనుండి తనకు కావలసిన శారీరిక సౌఖ్యంకోసం తాపత్రయపడటం మిక్కిలి హేయం. ఆతడిలో సహనం మృగ్యం. ఆతడు మానవుడుకాడు. పశువన్నా తప్పులేదేమో. ఒక చిన్న పొరపాటుకు చిలవలు, పలవలుచేసి, చేసుకున్న గృహిణిని బాధలు పెట్టే పురుషరత్నాలనుగూర్చి ఆలోచిస్తున్నాడు ఆనందరావు.

ఈ మనుష్యుడు చదువుకున్నవాడే. ఎందుకీచదువు. వ్యక్తిగా నలుగురిలో మెలగటానికి యెంత ముఖ్యమో- అంతే సద్గుణాలను అలవర్చుకోటం - ఇంతకు మించిన చదువు - సంస్కారం - అనే రెండు విషయాలను పుస్తకాలలో చదివి యూనివర్సిటీ డిగ్రీలు పొందగానేసరా!

హృదయ దౌర్బల్యంకల యీ పురుషుడు, ఒక చిన్న సమస్యను తేలికగా పరిష్కరించనేర్వలేని యీతడు, స్త్రీని నికృష్టజీవితాన్ని గడపుమని ఆదేశించి ఆతడు సాధించేదేమిటి? ఆతడి మృగ్యపు క్షణకాలపు ఐహిక దేహసంబంధమైన సుఖాలకోసం నలుగురిలో నగుబాట్లకు లోనవుతాడా?

ఎప్పటికప్పుడు పాతమీద ఏహ్యత, కొత్త జనిస్తుంది. క్రొత్తమీద యేదో అతీతమైన అవినాభావసంబంధం వూరకే కట్టలుత్రెంచుకుని ప్రవహిస్తుంది. ఈకాలపు అనేకుల పురుషులస్వభావాలిటువంటివి.

ఆనందరావు ఆలోచనలకు అంతరాయంకల్గింది. ఒక ఎలుక పైనుంచి క్రిందికిదూకింది. భయోత్పాదంతో శత్రుబారినుండి తప్పుకునిపోబోతూ, వెంబడిస్తూన్న పిల్లి నోటినుండి యువతలకు వొత్తిగిలలేక ఆపిల్లి పొట్టలో హాయిగా నిద్రపోతోంది.

ఆతనిలో మరల ఆలోచనలు మొలకలెత్తాయి.

"బలవంతుడు — బలిమిలేనివానిమీద చేసే స్వైర విహారం"

"ధనికుడు - ఆశ్రీమంతుడే బీదవానిని బానిసగా చేసి రాత్రింబగళ్లు ఆతనికండల్ని పిప్పిగా చేసి, చాకరిచేయించుకునే లోకపుతీరు"

"తనుపనిచేసే కంపెనీలోని ఆఫీసరుసవాళ్లు - తనతోడిగుమాస్తాలపై ఆతడుపయోగించే అసభ్య సంభాషణలు"

ఈ గుమాస్తాబ్రతుకు హేయమైనది. ఈ "సబార్డినేషన్" అటువంటిది. మరొకవుద్యోగానికి తరలిపోటానికి, యీ ఆఫీసరుక్రింద బానిసవృత్తికి పూర్తిలోదకాలీడానికి, వానిని "Conduct Certificate" కోసం అడిగితే వాని విదలింపులు - ఆతేను పన్నే కుతంత్రాలు.

సమాధానం ఒకటేపదం ఆతని నోటినుండి, గవులుకంపుకొడుతూన్న మిక్కిలి దుర్వాసనా భూయిష్టమగు ఆ పండ్ల ద్వారా వెలువడేది-అదే-సబార్డినేషన్ !!

శూన్యాకాశంలో ఏముంటుందో వీని బ్రతుకు కూడ శూన్యంగ చతికిలబడిమూర్చుంటుంది. ఈ గుమాస్తా జీవితపు అసంతృప్తి హేయపు పుటలలో.

ఆనందరావు హృదయ భారంతో తన ఎదనిండా నీరసతను నింపుకున్నాడు. ముఖాన్నిటవల్ తో తుడుచుకున్నాడు. గడియారం ఆగకుండా ఆరు గంటలు కొట్టింది. ఆతడొకసారి తలపైకెత్తాడు.

గోడగడియారం తనపనిని నిర్విఘ్నంగా జరుపుకుంటూపోతోంది. దీని డ్యూటీకంతరాయంకల్గిస్తే...

ఇది ఆతనిలో కల్గిన పంచలనం.

ఆతని వెర్రి తలపులు గడియారపు ధ్వనిలో కలసి విలీనమయినవి.

శోభ యింకా నిద్రపోతూనేవుంది. ఆమె వదనానికి తనమొగాన్ని ఆనించ బోయాడు ఆనందరావు.

"శోభ వులికిపడిలేచింది."

"నేనే శోభా!" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ ఆనందరావు.

ఆమె మనిషి యిప్పుడు బాగా సన్నపడింది. మొదటి కాన్పుకే ఆమెలో యౌవనము సడలిపోయిన చిహ్నాలు కనుపించుతున్నాయి, ఆమెమేని ఛాయల నిగనిగలలో.

కొంచెం బొద్దుగ పోతపోసిన బంగారు శిలావిగ్రహంలా ముఖంలో సముజ్వల భౌతిక సౌందర్యశ్రీ విలసిల్లే, ఆమెను చూసిననేత్రాలు ఈ సన్నిటి మనిషిని చూడలేకపోయాయి.

"చిక్కిపోయావు శోభా..."

"లేదండీ ఇదంతా నాపైమీకున్న వాత్సల్యమే అలా అనిపిస్తూవుంటుంది."

"ఊ"అంటూ తలవూపాడు శోభమనోరమణుడు.

తలుపు సందునుండి భానుమూర్తి తప్తకిరణజాలము సన్నగా లోనికి పరుగెత్తుకొనివస్తోంది. ఈ ఉదయ చందిని కలలో వారి రూపులు విచిత్రంగా అప్పుడే మెరుగుబెట్టిన విగ్రహాల్లా కొత్తకాంతుల్లో మెరుస్తున్నాయి.

ఈ సందడిలో "ఒదినా" అన్న సుమిత్రి పిలుపు వారిని కొంచెం యెడబాటుచేసింది.

శోభ ఆనందరావునుండి తప్పించుకుని వెళ్ళిపోయింది.

అన్నా చెల్లెలిద్దరూ నవ్వుకుంటూ ఆమె వెనుకే నడిచారు.

5

ఆ రోజున విద్యుద్దీపాల వెలుగుల్లో మెరుస్తున్న ఆమె వదనపు సోయగాన్ని చూస్తూ, ఆమె చెంపల్ని వయ్యారంగా తాకాడు ఆనందరావు.

కొన్ని క్షణాలు గడచిన తర్వాత

చుట్టూ చీకటి భయోత్పాతంగా ఆవరించివుంది.

దట్టమైన మేఘ సముదాయం వినీలాకాశపు వక్షస్థలంలో దాగుకొని వింతవింత రంగులలో విచ్చటానికి సంసిద్ధమౌతున్నాయి.

ఒక్కసారి గాలి తీవ్రంగా వీచింది. పెనుతుపాను వచ్చే సూచనలు విపరీతంగా కనబడుతోంది. ప్రశాంతవాతావరణము పురుముల మెరపులతో నిరాశా జనకమానవ హృదయంలా బావురుమంది. కాళరాత్రి ప్రళయ రేఖలలో ప్రకృతిని భీభత్స రేఖల గాలిపేలా వివరించిచెపుతోంది.

ఈ కోలాహలపు సందడి విశృతిని గలుపుతూ గదిలో శోభ నొప్పులు పడుతోంది. బయట వసారాలో కూర్చొనివున్న ఆనందరావు ఆమె పొందుతూన్న బాధను చూడలేక కండ్లుమూసుకున్నాడు. ఆ చీకటి తెరలలో వెలుగు తెరలు అదృశ్యమయినవి. కండ్లు తెరచాడు ఆనందరావు.

లోపలినుండి "క్యార్ - క్యార్" మని పిల్లవాడి యేడుపుతో భూమి దద్దరిల్లుతోంది. ఆనందరావు మనస్సులోని వేదనారావముతొలగిపోయి ఆ స్థానంలో "బాబా" రూపు చిత్రించబడి వివిధ కోణాల్లో అతనియెదుటనిలబడి "నాన్నా" అని పిలుస్తోంది. అతని హృదయం పిల్లవాని కోసం ఆతురతపడుతోంది. ఇప్పుడీ సమయంలో శోభ మూర్తిని ఒక్కసారి చూడాలనుకున్నాడు ఆనందరావు.

"శోభా" అంటూ ఆమె భర్త

"ఏమండి" అంటూ ఆనందుని ఆశాజ్యోతి పొందురులు పలుకరించుకున్నారు. ఒక మహదానందం వారి గంభీరపు వదన కాంతిలో వెల్లివిరిసింది.

ఇందాకటినుండి పడిన బాధలకనుకూలంగా శోభ యొక్క లేతగులాబివంటి చెక్కిళ్ళు యెర్రబడ్డాయి. ఆమె నొసటిమీద చూచాయగా కనబడుతూన్న చిరుచెమట బిందువులను చూస్తున్నాడు ఆనందరావు.

శోభ బెడ్‌మీద చెట్టుమీది యెండిపోయిన ఆకులాపడివుంది. ఆమె ముఖంలో అస్పష్టంగా ఓ మధురాను భూతి తొణికిసలాడుతోంది. ఆమె ప్రక్కనే పండల్లే పండుకొనియున్న పసికూన పాలబుగ్గలను ప్రేమతో నిమిరింది శోభ. ఎన్ని నాళ్ళనుండో పొంచి యుండిన ఆమె మాతృహృదయం ఒక్కసారి విస్పృతంగా పారే సెలయేటి కెరటాలలా, పుపొంగిపోయింది. పసిపాప పాల బుగ్గల అమాయిక కాంతి రేఖల్ని పరీక్షగా చూస్తోందామె

ఎదురుగా దేవునిపటం అలంకరించబడివుంది. అగరుధూపముల పరిమళము అంతటా నిబిడీకృతమయివుంది. బృందావనిలో వేణువు నూదుతూన్న శ్రీ కృష్ణపరమాత్మవైపే దృష్టినిగిడ్చిచూస్తున్నాడు పాల బుగ్గల పసిపాప. మాధవుని ఆశీర్వదించమని ప్రాధేయపడి అడిగింది శోభ.

సమాధానంగా వనమాలి చల్లనిచూపులు వారిపై కేంద్రీకరించాయి.

6

పసిపాపకండ్లలో పొందుపరచబడిన అమాయిక చిరునగవులను చూస్తూ, బాబు అంతా మా నాయన రూపే అంటూ అతని చిరు హస్తాలను తన చెంపలకు రాచుకుంటూ ముద్దులాడుతోంది చిట్టిబాబు నాయనమ్మ.

అదేమి మహాత్మ్యమోగాని యింకాకటినుంచి కుక్కిన పేనల్లే మారాముచేయక పండుకొని వుండిన బాబు తాతయ్యను చూడగానే గొంతెత్తి ఒక్కసారి

శృతికలిపాడు. ఇక ఆయన వాడి అవస్థచూడలేక పైమీద వుత్తరీయాన్ని తీసి ఒంకెకు తగిలించి బాబును భుజాన వేసుకున్నాడు. బాబు ఆయనబొర్ర మీసాలను చూస్తూ విచిత్రంగా వ్రేళ్ళను లెక్కపెడుతున్నాడు. ఆయన నెత్తిమీది ఆ పిలక సంపాదించుకున్న స్థానాన్ని మార్పుచేయటానికన్నట్లు దానితో తలపట్లుపడుతూ వదలకుండా వయ్యారంగా అంటిపెట్టుకుని కూర్చున్నాడు. ముసలాయన కొంతసేపు కులాసాగా, చిలిపిగా నవ్వుకుంటూ మనుమడితో ఆటలాడుకున్నాడు. రాను రాను వాడు చిలిపితనంతో చేస్తూన్న బాధను భరించలేక ఆతడ్ని వదలించుకోటానికి సిద్ధపడుతూ, బాబును కోడలికిచ్చి తను జారుకోటానికి ప్రయత్నించాడు.

వంకెన వ్రేలాడుతూన్న వుత్తరీయాన్ని తీసి గభాలున తాతయ్యనెత్తిమీదకప్పి తల్లి భుజంపై యెక్కి కూర్చున్నాడు ఉదయకుమార్.

'ఎంతటి అల్లరి పిల్లవాడవురా!' అంటూ వాడి చెక్కిలిని ముద్దుపెట్టుకొని మరీ ఆనందునితో మాట్లాడటానికి పంచలోనికి వెళ్ళాడు మాధవరావు.

7

సాయంత్రము ఆరుగంటలవుతోంది. బాహ్యప్రపంచానికి రావటానికి తలపట్లుపడుతూ, అపుడే కనువిచ్చిన సన్నజాజివిరికన్నె తాతమనుమడి సన్నివేశపు తమాషాదృశ్యాల్ని చూస్తూ తనలో గభాలున నవ్వుకొంది.

ఆ నగవునుండి అనేక సుగంధ పరిమళాలకాంతి జగతిలో నలుమూలలా ప్రసరించాయి.

ఈ వేళలోనే నిశికాంతకూడ రాత్రివేళలో జొరపడటానికి సకలవిధాల ప్రయాసపడుతోంది.

మరల ప్రజాబాహుళ్యపు అనంతప్రకృతిలో వెలుగురావటానికి ఆ రాత్రి గడవాలిమరి!

—(०)—

మెదడును చల్లబరచి

శిరోజములను నల్లబరచి

కురుల్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.